ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

యాకుత్‌పురా: పాతబస్తీ హరిబౌలి అక్కన్న మాదన్న మహంకాళీ ఆలయం అభివృద్ధికి ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆలయ కమిటీ సభ్యుల బృందం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును సోమవారం తన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఆలయాన్ని విస్తరించి మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వపరంగా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరామని ఆలయ కమిటీ అధ్యక్షుడు జగన్మోహన్ పర్షాద్ చెప్పారు. దీనిపై సానుకులంగా స్పందించిన మంత్రి ముఖ్యమంత్రితో చర్చించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అమృతవల్లికి పురస్కార ప్రదానం



అమృతవల్లికి పురస్కారాన్ని అందజేస్తున్న సరస్వతి తదితరులు

గన్‌ఫౌండ్రీ: మాతృభాషలో రాణిస్తున్న అమృతవల్లికి యునైటెడ్ హెరిటేజ్ ఆర్ట్స్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్ అంతర్జాతీయ పురస్కారాన్ని అందజేసింది. సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో మలేషియా ఉప మంత్రి సరస్వతి కందసామి చేతుల మీదుగా ఆమె పురస్కారాన్ని అందుకున్నారు. మన సంస్కృతికి చెందిన విద్యార్థిని అంతర్జాతీయ పురస్కారాన్ని అందుకోవడం పట్ల సంస్థ ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని పురస్కారాలను పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రామచంద్ర, పవన్ పాల్గొన్నారు.

అన్నదానం

గోల్కొండ: పేదలకు అన్నదానం చేయడమే తమ ఆశయమని ప్రముఖ సంఘ సేవకుడు మహ్మద్ బషీర్ అన్నారు. ఆదివారం ఆయన పలు ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రిలో రోగులు, వారి సహాయకులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దూర ప్రాంతాల నుంచి ఆసుపత్రులకు వచ్చే వారిలో ఎక్కువగా నిరుపేదలే ఉంటారని అన్నారు. అటువంటి వారికి ప్రతిరోజూ భోజనం అందించడానికి తాను కృషి చేస్తున్నాన్నారు.



ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి వద్ద అన్నదానం చేస్తున్న దృశ్యం

మహంకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు



పూజలలో పాల్గొన్న వివిధ ఆలయాల కమిటీ ప్రతినిధులు

చార్మినార్: ఉప్పుగూడ మహంకాళి ఆలయ పునర్నిర్మాణ 11వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని పాతబస్తీలోని వివిధ ఆలయాలకు చెందిన కమిటీ ప్రతినిధులు ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్యతో పాటు బేలా ముత్యాలమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు పాటిల్ సదానంద్ యాదవ్, సుల్తాన్‌షాహీ జగదాంబ ఆలయ కమిటీ చైర్మన్ రాకేష్ తివారి, హరిబౌలి బంగారు మైసమ్మ ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు మధుసూదన్ యాదవ్ తదితరులు హాజరు కాగా.. వారికి ఆలయ కమిటీ చైర్మన్ జనగామ మధుసూదన్ గౌడ్ ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు.

ప్రజలకు ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరు చేయాలి

అబిడ్స్: పేద ప్రజల వైద్య సేవల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఆరోగ్యశ్రీ కార్డులను మంజూరు చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహాకు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ..గతంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు ఆరోగ్య శ్రీకార్డులు మంజూరు చేశారన్నారు. గత పదేళ్ల పాటు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం ఏ ఒక్కరికి ఆరోగ్యశ్రీ కార్డు కానీ, తెల్లరేషన్‌కార్డు కాని మంజూరు చేయకపోవడంతో లక్షలాది మందికి ఉచిత వైద్య సేవలు అందడం లేదన్నారు. పేద ప్రజలను దృష్టిలో పెట్టుకుని వెంటనే అర్హులైనవారందరికీ ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరు చేస్తే ఉచిత వైద్య సేవలు పేదలకు అందుతాయన్నారు. కేసీఆర్ ప్రభుత్వం పదేళ్లపాటు పేద బడుగు వర్గాలకు ఒక శాపంగా మారిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యం అమల్లోకి తెచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో దశరథ్, పోల్కం వినయ్‌రాజ్, ఆదిమూలం శంకర్, వెన్ను శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి దామోదర రాజనర్సింహాకు మెమోరాండం అందజేస్తున్న పోల్కం శ్రీనివాస్

దంచికొట్టిన వాన



టోలిచౌకీ-టూమ్స్ రోడ్డుపై నిలిచిన వరద నీరు

గోల్కొండ: భారీ వర్షానికి నానల్‌నగర్ చౌరస్తా, టోలిచౌకీ తదితర ప్రాంతాల్లో వరద నీరు రోడ్లపై సుమారు రెండు అడుగుల మేర నిలిచిపోయింది. టూమ్స్ రోడ్డుపై భారీగా వరద నీరు చేరడంతో ఎక్కడి వాహనాలు అక్కడే ఆగిపోయాయి. గోల్కొండలోని లోతట్టు ప్రాంతాలైనా హీరాఖానా, నయాకిలా రోడ్లు మొత్తం జలమయమయ్యాయి. నాలా తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్రధాన రోడ్లలోని డ్రైనేజ్ మ్యాన్‌హోళ్లల్లో చెత్త పేరుకుపోవడంతో వరద నీరు ముందుకు సాగాక ఎక్కడిక్కడే నిలిచి పోయింది. వరదనీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గుడిమల్కాపూర్ ప్రధాన రహదారిపై భారీగా వరద నీరు ప్రవహించింది. టోలిచౌకీ నదీమ్ కాలనీ తదితర ప్రాంతాల్లో సైతం భారీగా వరద నీరు చేరింది.

లోతట్టు ప్రాంతాలు జలమయం..

యాకుత్‌పురా: సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి పాతబస్తీలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. తలాబ్‌కట్టా, నషేమన్‌నగర్, చాచాగ్యారేజ్, మొఘల్‌పురా, బీబీ బజార్ చౌరస్తా, బడాబజార్, హరిబౌళి, బేలాచౌరాస్తా, ఎస్ఆర్టీ కాలనీ, రెయిన్‌బజార్, ముర్తుజా నగర్, యాకుత్‌పురా రైల్వే స్టేషన్, జఫర్ రోడ్డు, యశ్రఫ్ నగర్, మదీనానగర్, దోభీఘాట్, సరస్వతీనగర్, సుల్తాన్‌షాహి, వాల్మీకినగర్, ఎత్తేబర్‌చౌక్, గంగానగర్



నషేమన్‌నగర్‌లో రోడ్డుపై..

భక్తిశ్రద్ధలతో బక్రీద్

- ప్రశాంతంగా సామూహిక ప్రార్థనలు
- మీరాలం ఈద్గా రోడ్డులో కొనసాగిన ట్రాఫిక్ ఆంక్షలు



మీరాలం ఈద్గా వద్ద ముస్లింల ప్రార్థనలు..



మసాబ్ ట్యాంక్‌లోని అన్నా హాకీ గ్రౌండ్ వద్ద..



చార్మినార్: బక్రీద్ వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. సోమవారం ఉదయం మీరాలం ఈద్గాతో పాటు మక్కా మసీదు, మాదన్నపేట్ ఈద్గాలలో సామూహిక ప్రార్థనలు ప్రశాంతంగా ముగిశాయి. సామూహిక ప్రార్థనల కోసం ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేయడంతో ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు. ప్రార్థనల సందర్భంగా మీరాలం ఈద్గా రోడ్డులో ఉదయం 8 గంటల నుంచి ప్రార్థనలు ముగిసేంత వరకు ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగాయి. వాహనదారులకు ఎక్కడ అసౌకర్యం కలుగకుండా ముందుగానే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంతో ట్రాఫిక్ జాం సమస్యలు తలెత్త లేదు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా దక్షిణ మండలం డీసీపీ స్నేహ మెహ్రా పర్యవేక్షణలో భారీ బందోబస్తు కొనసాగింది. మీరాలం ఈద్గా, మక్కా మసీదు, మాదన్నపేట్ ఈద్గాల వద్ద ముందుగానే ఏర్పాటు చేసిన మెటల్ డిటెక్టర్‌ల ద్వారా కుణ్ణంగా తనిఖీలు నిర్వహించిన అనంతరమే సామూహిక ప్రార్థనలకు అనుమతించారు. నగర అదనపు పోలీస్ కమిషనర్ (లా అండ్ ఆర్డర్) విక్రం సింగ్ మాన్, సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ అదనపు పోలీస్ కమిషనర్ వి.సత్యనారాయణ, ట్రాఫిక్ అదనపు పోలీస్ కమిషనర్ విశ్వప్రసాద్, ట్రాఫిక్ డీసీపీ ఆర్.వేంకటేశ్వర్లు, చార్మినార్ ట్రాఫిక్ ఏసీపీ లక్ష్మణ్ తదితరులు ముస్లిం మత పెద్దలను కలిసి ఈద్ ముబారక్ తెలిపారు.

గోల్కొండలో..

గోల్కొండ: బక్రీద్ పండుగ సోమవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఉదయం 6.30 గంటల నుంచే పలు ప్రాంతాల్లోని జామా మసీదులలో బక్రీద్ ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. గోల్కొండ, బంజారా దర్వాజ సమీపంలోని కుతుబ్‌షాహీ మసీదులో జరిగిన ఈద్ ప్రార్థనలకు ఆల్ ఇండియా సీరత్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ మతీన్ అలీషా ఖాద్రీ నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అల్లాపై ఉన్న భక్తికి ఏ శక్తి కూడా సరి రాదని అన్నారు. తల్లిదండ్రులను గౌరవించడమే కాకుండా వారిని ఆదరించాలని ఆయన సూచించారు. ఈ ప్రార్థనల్లో సుమారు 45 వేల మంది పాల్గొన్నారు.



కుతుబ్‌షాహీ ఈద్గా వద్ద ఈద్ సందేశం వినిపిస్తున్న మతీన్ అలీషా



ముస్లిం మత పెద్దలకు ఈద్ ముబారక్ తెలియజేస్తున్న ఐపీఎస్ అధికారులు

ఈద్ ముబారక్..

చార్మినార్: బక్రీద్ పండుగను పురస్కరించుకుని ఎంబీటీ అధికార ప్రతినిధి అంజదుల్లాఖాన్‌కు ఆ పార్టీ సంయుక్త కార్యదర్శి బుంగ శివకుమార్ సోమవారం ఈద్ ముబారక్ తెలిపారు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై వైద్య సేవలు పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను కలిసి పండుగ శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు త్వరగా కోలుకోవాలని కోరినట్లు బుంగ శివకుమార్ తెలిపారు. ఆయన వెంట బుంగ శ్రావన్‌కుమార్ ఉన్నారు.



అంజదుల్లాఖాన్‌కు ఈద్ ముబారక్ తెలియజేస్తున్న బుంగ శివకుమార్



అసదుద్దీన్ ఒవైసీకి బక్రీద్ శుభాకాంక్షలు తెలపుతున్న మజ్లిస్ పార్టీ నాయకులు

అసదుద్దీన్ ఒవైసీకి బక్రీద్ శుభాకాంక్షలు..

యాకుత్‌పురా: బక్రీద్ పండగా సందర్భంగా మజ్లిస్ పార్టీ అమన్‌నగర్-బీ అధ్యక్షుడు మహ్మద్ మొహీనుద్దీన్ ఆధ్వర్యంలో నాయకులు సోమవారం పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీని కలిసి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నాయకులు, మొహీన్ కన్‌స్ట్రక్షన్స్ నిర్వాహకులు మహ్మద్ ఆయనుద్దీన్, మహ్మద్ అమానుద్దీన్ ఉన్నారు.



ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్



ఎమ్మెల్యే కౌసర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

ఇమాంబాడలో..

బక్రీద్‌ను పురస్కరించుకొని యాకుత్‌పురా ఇమాంబాడలోని ఈద్గాలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ స్థానిక ప్రజలతో కలిసి పాల్గొన్నారు. ఆయనతో పాటు రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్, మజ్లిస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక బస్తీల ప్రజలు పాల్గొన్నారు.

ఉద్యోగులకు అండగా టీఎన్జీఓస్ యూనియన్



అబిడ్స్: ఉద్యోగులకు అండగా టీఎన్జీఓస్ సెంట్రల్ అసోసియేషన్ నిరంతరం కృషి చేస్తుందని అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం. ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. సోమవారం టీఎన్జీఓస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కేఆర్.రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్, కార్యదర్శి వైదిక్ శాస్త్రిల ఆధ్వర్యంలో ముజీబ్ హుస్సేన్‌ను ఘనంగా సత్కరించి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శంకర్, శ్రీధర్, వెంకట్‌రెడ్డి, వహీద్, మోహన్‌రావు, సత్యనారాయణ, సుదర్శన్, శ్రీబాలజీ, పురుషోత్తమ్, మహేష్‌గౌడ్, రాంబాబు, మోహన్, శ్రీనివాస్, రమేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



గోల్కొండ: గోల్కొండ రిసాల బజార్‌లోని హనుమాన్, శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజ లు జరిగాయి. గోల్కొండ జగదాంబిక అమ్మవారి వృత్తిపని సంఘం అధ్యక్షుడు, బి.సాయిబాబాచా రి టోలిచౌకీ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు బి.శ్రీకాంత్‌చారి తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

భరత్‌సింగ్ సేవలు చిరస్మరణీయం



నివాళులర్పించిన జీవన్‌సింగ్, బాబన్న

జియాగూడ: ప్రముఖ సంఘ సేవకుడు దివంగత భరత్‌సింగ్ సేవలు చిరస్మరణీయమని సనాతన హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి రాష్ట్ర కోశాధికారి కాశిబుగ్గ బాబన్న అన్నారు. సోమవారం నాయకులు ఠాకూర్ జీవన్‌సింగ్ ఆధ్వర్యంలో ఏర్పాటైన సంతాప సభకు హాజరై భరత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఆలయాల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమితి కార్వాన్ నియోజకవర్గం అధ్యక్షుడు సి.చంద్రశేఖర్, జియాగూడ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సి.బాబు, కె.నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పత్రీజీ ధ్యాన జ్ఞాన మహా యజ్ఞం

గన్‌ఫౌండ్రీ: పిరమిడ్ స్పిరిచ్వల్ సొసైటీస్ మూవ్మెంట్ ఆధ్వర్యంలో నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో పత్రీజీ ధ్యాన జ్ఞాన మహా యజ్ఞం ఘనంగా కొనసాగుతుంది. 3వ రోజు అయిన సోమవారం పలువురు వక్తలు హాజరై ప్రసంగించారు. స్పిరిచ్వల్ మూవ్మెంట్ ధ్యాన ట్రస్ట్ ఆధ్వర్యంలో చక్కటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని పలువురు వక్తలు కొనియాడారు. అంతకు ముందు స్వర్ణభారతి మ్యూజికల్ సంగీత ధ్యానం, సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంజయ్ సింగ్, డాక్టర్ సుధామి, ఎంఎల్.రామ్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: మనుషులను యంత్రాలుగా మార్చే కృత్రిమ మేధస్సుకు సమాజంలో కుటుంబ, మానవీయత విలువలకు ముప్పు వాటిల్లుతుందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారుడు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. సాధన సాహితి స్రవంతి సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ బి.రామాచార్యులు రచించిన నామస్మరణం-మోక్షదాయకం పుస్తకాన్ని సోమవారం ఆయన తన కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..నేటి తరం పిల్లలకు దైనందిన జీవితంలో ఎదురయ్యే ఒత్తిడి సమస్యలను అధిగమించేందుకు పురాన కథలు, పద్యాలతోపాటు దైవనామస్మరణ ఎంతో ఉపయోగమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓయూ విశ్రాంత ఆచార్యులు కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, సినీ గేయ కవి వెనిగళ్ల రాంబాబు, సంస్థ అధ్యక్షులు సాధన నర్సింహాచార్య, కార్యదర్శి సంభుని కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ కేవీ రమణాచారి తదితరులు

తల్లి ప్రేమ వెలకట్టలేనిది

గన్‌ఫౌండ్రీ: ఈ సృష్టిలో వెలకట్టలేనిది తల్లి ప్రేమ అని పలువురు వక్తలు అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో పికాసో ది స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో 'ఎండ్ లెస్ లవ్'చిత్రకళా ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ.. తల్లిప్రేమ గురించి ఎంతచెప్పినా తక్కువేనన్నారు. పాఠశాల స్థాయి నుంచి అద్భుతమైన చిత్రాలను గీసిన చిన్నారులను కొనియాడారు. ఈ చిత్రకళా ప్రదర్శన ఈనెల 18వ తేదీ వరకు కొనసాగుతుందని సంస్థ నిర్వాహకులు రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు రమణారెడ్డి, తెలుగు విశ్వ విద్యాలయం చిత్రకళ బోధకులు మహేష్, సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞశర్మ తదితరులు పాల్గొన్నారు.



చిత్రకళా ప్రదర్శనను ప్రారంభిస్తున్న మామిడి హరికృష్ణ తదితరులు

సమస్యలపై ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌కు వినతి

రాజేంద్రనగర్: బుద్వేల్ బస్సీలాల్‌నగర్ బస్తీతో పాటు ప్రధాన రహదారిపై వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, బస్తీల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని శ్రీ శ్రీనివాస సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు సాయి మల్లిక్ కోరారు. సోమవారం ఉదయం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కలిసి ప్రజా సమస్యలను వివరించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రధాన రహదారితో పాటు అంతర్గత బస్తీలో వీధి దీపాలు వెలగడం లేదన్నారు. దీంతో స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రోడ్లపై ప్యాచ్‌వర్క్‌ను నిర్వహించాలని ఎమ్మెల్యే ను కోరారు. అందుకు సానుకూలంగా స్పందించారని, సంబంధిత అధికారులను పిలిపించి చర్యలు చేపడుతానని హామీ ఇచ్చారన్నారు.

మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన పంకజ్ షిండే



గౌలిపురా: పాతబస్తీకి చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు, శ్రీ ఓంకార్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు పంకజ్ షిండే బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం మాజీ సీఎం కేసీఆర్‌ను ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో కలిసి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా పంకజ్ షిండే మాట్లాడుతూ..పార్టీ పూర్వ వైభవం కోసం కృషి చేస్తానని అన్నారు. కేసీఆర్‌ను కలవడం ఆయన ఆశీస్సులు తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు.

రాష్ట్ర గన్నీ బ్యాగ్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జగదీష్



అఫ్జల్‌గంజ్: తెలంగాణ రాష్ట్ర గన్నీ బ్యాగ్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడుగా పేరే జగదీష్ వంజరి ఎన్నికయ్యారు. సోమవారం మహారాజ్‌గంజ్‌లో నిర్వహించి ఎన్నికల్లో కే.వీ రేశంపై 15 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ..గన్నీ బ్యాగ్స్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ప్రతిఏటా శ్రీరామనవమి సందర్భంగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వ్యాపారులు, కార్మికులు ఆయనను ఘనంగా సన్మానించారు.

ప్రజా సేవకే జీవితం అంకితం



కూన శ్రీశైలంగౌడ్‌కు బొకేను అందజేస్తున్న ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: ప్రజా సేవకే జీవితం అంకితమని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. నిరంతరం ప్రజా సేవా కార్యక్రమాలు చేపడుతూ ప్రజలకు విశేష సేవలందిస్తానన్నారు. గోషామహల్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేమూరి నరేష్ గౌడ్, సత్యనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం



పూజిత

సుల్తాన్‌బజార్: వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యమైన ఘటన సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన పూజిత (20) బీటెక్ 3వ సంవత్సరం చదువుకుంటూ బంజారాహిల్స్ రోడ్ నెంబర్-1లో పార్ట్‌టైం జాబ్ చేస్తుంది. ఈ క్రమంలో పూజిత తండ్రి బానావత్ పంతుల నాయక్ కోఠిలోని ఉస్మానియా మెడికల్ కళాశాల బస్టాప్ వద్ద ఈనెల 16న వదిలి వెళ్లాడు. ఆమె ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆమె తండ్రి సుల్తాన్‌బజార్ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో..

మీర్‌పేట్ ప్రశాంత్‌నగర్‌కు చెందిన చాందీ (73) కోఠి మహంకాళి టెంపుల్ వద్ద పరుగెత్తుకుంటూ వెళ్లి అదృశ్యమైంది. ఆమెకు మతిస్థిమితం సరిగా లేదు. భర్త తులసి రామ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



చాందీ